

# నా కళ్ళతో నాన్న

– లిపి మల్లాది



ఆంధ్రుల ఆహ్లాద రచయిత మల్లాది వెంకట కృష్ణమూర్తిగారు ఇటీవల ఫేమిలీ ఆల్బమ్ పేరుతో సొంత అనుభవాలను రచనలో వ్రాశారు. వందల, వేల పాత్రలను సృష్టించిన మల్లాదిగారిని వాళ్ళ అమ్మాయి కళ్ళతో చూస్తే ఎలా ఉంటుంది? అందుకు సమాధానమే ఈ ధారావాహిక. మల్లాదిగారు, పద్మజగార్లకు ముగ్గురు సంతానం - కావ్య, ఊహ, లిపి. ముగ్గురూ అమెరికాలోనే ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు చేస్తున్నారు. చిన్నమ్మాయి లిపి, వాళ్ళ నాన్నగారి గురించి వ్రాస్తున్న ఈ సంఘటనలు పాఠకులకు ఆసక్తికరంగా ఉంటాయని ఆశిస్తున్నాం.

*(గత సంచిక తరువాయి)*

**ప్రతీ మనిషికి** జీవితంలో రెండు పేర్లుంటాయి. ఒకటి తల్లిదండ్రులు ఇచ్చేది, రెండు వారు సంపాదించుకునేది. (నాకు రెండూ మా నాన్న వల్లే వచ్చాయి) మా నాన్న పూర్తిపేరు మల్లాది వెంకట కృష్ణమూర్తి. తన ఫ్యామిలీ ఆల్బంలో ఆ పేరుకి వెనక ఉన్న చరిత్రని వివరించారు. బయట వారికి మా నాన్న "మల్లాదిగారు". తన కుటుంబీకులకి "కిష్టప్ప". మా అమ్మ తరపు బంధువులకి "మూర్తిగారు". తన పేరులో ఉన్న ‘వెంకట‘ని మాత్రం ఎవరూ ఉపయోగించరు. నాకు ‘నాన్న‘ అని పిలిచే అలవాటు లేకపోతే ఆ పేరుని వృధా అవ్వనిచ్చేదాన్నికాదు. ఇన్ని పేర్లున్నా మా అమ్మ "సుబ్బారావ్" అని కూడా పిలుస్తుంది. ఊహ భర్త నందు ఒకరోజు మా అమ్మని ‘మాజీ‘ అని పిలవడం విని, "అమ్మని ‘మాజీ‘ అంటే నిన్నేమని పిలుస్తాడు నాన్న?" అని అడిగాను. "నన్ను ‘పితాజీ‘ అని పిలుస్తాడు" అని మా నాన్న అన్న వెంటనే మేమందరం నవ్వాము.

‘తండ్రిపేరు పెద్దగా ఉన్నా పిల్లలకి ఎందుకు అంత చిన్న పేర్లు పెట్టారు?‘ అని అనుకుంటున్నారా? ఎందుకంటే పెద్దపేరు వల్ల వచ్చే ఇబ్బందులు తెలుసు కనుక. ఒకసారి ఏదో అప్లికేషన్ ఫార్మ్ పై పేరు రాస్తున్న క్లర్క్‌కి "ఎం.ఏ..ఎల్...ఎల్..ఏ...డి...ఐ...వి..ఈ" అని స్పెల్లింగ్ చెపుతుండగా ఆ క్లర్క్ కొన్ని అక్షరాలు రాసాక మా నాన్న వంక చూసి, "మీ పేరుకి ఇంకా ఎంతసేపు పడుతుంది?" అని అడిగారట. ఆ రోజు "నా పిల్లలకి కేవలం రెండక్షరాల పేరు మాత్రమే పెడతాను" అని మా నాన్న నిశ్చయించుకున్నారట.

కావ్య పేరులో వకి య వత్తు ఉందని, కాస్త క్లిష్టమైన పేరు పెట్టినందుకు సారీ అని చెప్పారట. ఊహ పుట్టడానికి ముందు "ఏదైనా మంచి పేరు ఆలోచించు" అని మా అమ్మతో అన్నారట. "నేనే ఒక కొత్త పేరుని ఊహించి పెడతాను" అని మా అమ్మ బదులివ్వగానే తనలో ఉన్న రచయిత ‘ఊహ‘ని పసిగట్టి, "ఊహ అనే పెడదాం"అని అన్నారట. నా పేరు గురించి ఎంతకాలం ఆలోచించారో తెలీదుకానీ స్కేనింగ్‌లో అమ్మాయి అని తెలియగానే "లిపి" అని ఒకేసారి అన్నారట. నేను అబ్బాయిగా పుట్టుంటే నా పేరు మా నాన్నకి ఇష్టమైన "పృధ్వీరాజ్" అయ్యేది. (నాకు కొడుకుపుట్టినా అంతే!)

మా నాన్న ఫేవరెట్ డాటర్ నేనే అనడానికి నిదర్శనం 'లిపి పబ్లికేషన్స్' నా పేరుపై పబ్లికేషన్స్‌ని స్థాపించారని తెలిసినా, నాకే పబ్లికేషన్స్ పేరుని పెట్టారని గొడవ చేసేదాన్ని (ఇక మీదట చేయలేను కాబోలు). మా నాన్న బుక్స్ అన్నిటి పైనా ఉన్న 'లిపి పబ్లికేషన్స్'ని రాసింది ఆరేళ్ళ వయసున్నప్పటి ఊహ. ఈ రకంగా మా నాన్న ప్రతీ పుస్తకంలో ఒక చిన్న పర్సనల్ టచ్ ఉంటుంది.

లిపి అనేది నా ముద్దు పేరని చాలా మంది భావిస్తారు.

"నీ ఫుల్ నేం లక్కమాంబ అనుకున్నాను. అలా చెప్పుకోవడం ఇష్టంలేక లిపి అంటున్నావనుకున్నా" అని ఒకతను అన్నాడు.

"లక్కమాంబ అయితే లక్కీ అని చెప్పేదాన్ని కానీ లిపి అని ఎందుకు చెప్తాను?" అని ప్రశ్నించాను.

ప్రతి ఒక్కరు "ముందూ వెనక ఏం లేదా? పూర్తి పేరేంటి?" అని అడగడంతో "లిపి మల్లాది" అని పరిచయం చేసుకోవడం అలవాటైంది. అసలే ముద్దుగా ఉన్న నా పేరుని ఇంకా ముద్దుగా లిప్స్ అని, లిపిక్స్ అని, పై అని, మొదలగు పేర్లతో పిలుస్తారు. చిన్నతనంలో నన్ను ఆటపట్టించడానికి "ఛీ...లిపి (చిలిపి)" అని, "లిపిని తిరగేస్తే పిల్లి...మియావ్" అన్నప్పుడు నేను నిజంగా ఏడ్చిన సందర్భాలు కూడా ఉన్నాయి.

మా నాన్న రైటర్ అన్న సంగతి నన్ను ఎప్పుడూ కలవని వారికి కూడా తెలుసు. నా ఫ్రెండ్స్‌తో చాలామంది "లిపి ఆ? అదేం పేరు? పెట్ నేం కాదా? తెలుగు వచ్చా? ఎక్కడమ్మాయి?" వంటి ప్రశ్నలు అడుగుతారట "లిపి అంటే స్క్రిప్ట్, వాళ్ల డేడ్ రైటర్" అని జవాబిస్తుంటారట. 'మా నాన్న రైటర్' అనగానే నా పేరు గురించి ప్రశ్నలు ఆగిపోతాయి. చాలామంది దివ్యలు, ప్రియాంకలు, రమ్యలు, అనూషలు, మౌనికలు ఉండడంతో ఉన్న ఒక్క లిపిని ఈ రోజుకీ నా చిన్ననాటి క్లాస్‌మేట్స్ గుర్తుపడతారు. నా ముఖం తెలియకపోయినా నా పేరువల్ల నేను చాలామందికి తెలుసు. అలా ఏం సాధించకపోయినా నా పేరుతో "పేరు" తెచ్చుకున్నాను.

ఎంత సింపుల్ పేరైనా ఖూనీ చేయచ్చు అని నిరూపించడానికి మా ఆఫీస్‌లో ఒక మేనేజర్ నన్ను "ల్లీప్పీ..." అని సాగతీసి పిలిచినప్పుడల్లా "మా నాన్న వింటే ఏమనుకుంటారో" అని ఆలోచిస్తాను. ఒకసారి ఎయిర్‌పోర్ట్‌లో నా పేరుని 'లీపై' అని, ఎవరూ స్పందించకపోవడంతో 'లైపై' అని పిలిచారు. ఇంకాసేపాగితే ఇంకా ఎలా పిలుస్తారో అని "ఇట్స్ లిపి" అని వారిని సరిచేసాను. చిన్న పేరుకే ఇన్ని కథలుంటే పెద్ద పేర్లకి ఇంకెన్నుంటాయో!

అప్లికేషన్ ఫార్మ్స్‌లో స్పెల్లింగ్ మిస్టేక్స్, వాటిని సరిచెయ్యడానికి మరిన్ని కరెక్షన్ ఫార్మ్స్ - నాలుగక్షరాల పేరుకన్నా ఇరవై అక్షరాల పేరులో ఎక్కువ తప్పులు జరుగుతాయి. మా నాన్న ఇలాంటివి జరుగుతాయని రెండు జతల ఫార్మ్స్ తీసుకుంటుంటారు. ఒక దాంట్లో తప్పురాస్తే ఇంకోటి అందుబాటులో ఉండటానికి. ఒకసారి మా నాన్న అమెరికాకి వెళ్లినప్పుడు తన పేరులో 'టి'ని 'పి' అనుకుని 'మూర్తి'ని 'మర్ఫీ'కి మార్చారు. (అప్పటికి కంప్యూటర్లు రాలేదు) అలా మానాన్నకున్న పేర్ల లిస్ట్‌లోకి మర్ఫీ చేరింది. పరీక్షల్లో ఆన్సర్ షీట్స్‌పై పేరు రాయడానికే పది నిమిషాలు, ఒక పూర్తి లైన్ పట్టేవట. కొన్ని అఫీషియల్ పేపర్లపై మా నాన్న పేరు ఇరికించాల్సి వచ్చేది.

మెక్సికోకి వెళ్లినప్పుడు అందరూ మా అమ్మని 'పద్మాహ మయాడి' అని పిలిచారు. అలాగే చైనాలో మా అమ్మ పేరు 'పద్మః', పెద్ద పేరు కష్టాలు తెలిక పోయినా అవే ఆలోచనా భావాలు కల ఊహ ఫిబ్రవరి 2016లో జన్మించిన తన కూతురుకి 'నీసా' అని రెండక్షరాల, ఒత్తులు లేని పేరు పెట్టింది. యధావిధిగా నీసాని కూడా చిన్నది చేసి 'నీస్' అని పిలుస్తుంటుంది. మా అమ్మ సీసాయ్ లాగా 'నీసాయి' అని పిలుస్తుంది. మా నాన్న చిన్నప్పుడు మమ్మల్ని పిలిచినట్టే 'పిల్లదానా' అంటారు.

"నాన్న రైటర్ కాబట్టి మీ పేర్లు కావ్య, ఊహ, లిపి అయ్యాయి. అదే నాన్న వంట వాడయ్యుంటే మీ పేర్లు పిండి మిరియం, కందా బచ్చలి, చామదుంప అయ్యేవి" అని మా అమ్మ ఒక రోజు నవ్వింది. మా నాన్న రాసిన నవలలు అందరికీ తెలిసినవే. ఎన్ని నవలలు రాసారు, ఎన్ని ట్రావెలాగ్స్ రాసారు, ఎన్ని కథల పుస్తకాలు రాసారు, ఎన్ని ఆధ్యాత్మిక పుస్తకాలు రాసారు, మొదలగు విషయాలు ఎవ్వరైనా

లెక్కపెట్టగలరు. కానీ మా నాన్న ఈనాడు సండే సప్లిమెంట్రీ, విపుల, చతుర వంటి మేగ్‌జైన్స్‌లో మా అమ్మకి కూడా తెలియకుండా కొన్ని కథలు ప్రచురించారు. ఆ కథలను చదివి, శైలిని కనిపెట్టి "ఇవాళ్ళ వార్తల్లో రాసిన రాజ్ మీరే కదా?" అని అడిగిందట. మా నాన్న "ఎలా కనిపెట్టావు?" అంటే "మీ శైలి" అని నవ్విందట. అలా మా నాన్న ఎన్నో పెన్ నేమ్స్‌ని వాడారు. వాటిలో కొన్ని కిష్టప్ప, పృథ్వీరాజ్, రేవతి, రాజు, సంయుక్త, సత్యాదేవి, ఆశ్లేష, ఎం, రాణి, వెంకట్. ప్రతీవారం కథలన్నీ చదివి వాటిల్లో మా నాన్నది కనిపెట్టడం మా అమ్మకి చాలా ఇష్టం. "నాన్న చెప్పకుండా నేనే కనిపెట్టాను తెలుసా!" అని గర్వంగా చెప్తుంటుంది.

నేను ఎల్.కేజీలో ఉన్నప్పుడు నా ఫ్రెండ్ మౌనికకి ఆ పేరుని మా నాన్న రాసిన 'ఒక నువ్వు ఒక నేను' చదివి పెట్టామని వాళ్ల అమ్మ చెప్పింది. అలాగే ఊహకి ఏడవతరగతిలో పరిచయమైన మధులిక "నా పేరుని మీ నాన్న రాసిన 'ధర్మయుద్ధం'లోంచి పెట్టారు" అని చెప్పింది.

మా అమ్మ ఫ్రెండ్ లావణ్య వాళ్ల కూతురికి 'స్రవంతి' అని మా నాన్న నవల పేరు పెట్టారట. అలా 'మిస్టర్ వి' లోని 'దీపిక', 'ఎయిర్ హోస్టెస్'లోని 'మేఘన', మొదలగు పేర్లని పెట్టుకున్నారు. ఇవి విన్నప్పుడు "ఆ నవలలో కేరెక్టర్‌కి ఆ అమ్మాయికి ఏమైనా పోలికలు ఉండి ఉంటాయా? అసలు ఆ అమ్మాయికి నవల చదివి అంతగా ఏం నచ్చిందో తెలుసుకోవాలనే కుతూహలం ఉందా?" అనే ప్రశ్న నాకు కలుగుతుంది. బహుశా నా పేరు పృథ్వీరాజ్ అయ్యుంటే నేను ఆ నార్త్ ఇండియన్ రాజు కథని పూర్తిగా తెలుసుకుని ఆయనలో ఉన్న మంచి గుణాలని, ఆయన చేసిన మంచి కార్యాలని, మా నాన్నకి నచ్చిన అంశాలని తెలుసుకుని నేనూ అదే విధంగా ఉండేదాన్ని (లేక ఉండేవాడిని)

డైరెక్టర్ షిండే తన కూతురికి 'మేఘమాల' అని మా నాన్న నవలలోని పేరుని పెట్టారట.

అలానే ఊహ పేరు బాగా నచ్చి ఈ.వీ.వీ సత్యనారాయణ హీరోయిన్‌కి అదే పేరు పెట్టారట. "ఊహ పేరు చాలా బావుందండి. భలే పెట్టారు" అని మా నాన్నతో చాలాసార్లు అన్నారట. మా చుట్టాలు, తన స్నేహితులు ఏదో సినిమాలో క్లైమాక్స్ చూసి "ఊహమ్మ, వద్దమ్మా ఊహమ్మా, అంత పని చెయ్యకమ్మ, ఊహమ్మా...ఊహమ్మా.." అని బాగా ఆట పట్టించేవారు.

మా నాన్న రాసుకుంటూ "లిపి ఒక ఫ్రెండ్ పేరు చెప్పమ్మా" లేదా "లిపి, ఒక ఎనిమీ పేరు చెప్పమ్మా" అని అడిగేవారు. తను రాసిన చాలా నవలల్లో నా ఫ్రెండ్స్ పేర్లని హీరో, హీరోయిన్‌లకి, నా ఎనిమీస్ పేర్లని విలన్‌లకి వాడారు. అలా పెట్టిన పేర్లలో ఒకటి 'ఎవరికీ చెప్పక'లో హీరో 'కాశ్యప్', 'వైకుంఠయాత్ర'లో హీరోయిన్ 'అద్రీజా' వాళ్ళిద్దరూ ఈ రోజుకీ నాకు మంచి స్నేహితులే. 'సద్దాం ఆంటీ ఇంటి కథ'లో 'సద్దాం ఆంటీ'ని సజెస్ట్ చేసింది ఊహే. ఆస్ట్రానమీ పై ఇష్టంతో ఒకరోజు "నాకు అంతరిక్షా అని పేరు ఎందుకు పెట్టలేదు?" అని అడిగాను.

"అప్పుడు అందరూ నిన్ను 'రిక్షా, రిక్షా' అని పిలిచేవారు" అని మా అమ్మ సమాధానమిచ్చింది. ఆ తరువాత మా నాన్న రాసిన ఒక కథలో ఆ పేరుని వాడారు.

మూడవ తరగతిలో ఉన్న కూతురుని పేర్లు అడిగి వాడడం, మేము ఇచ్చిన సజెషన్స్ ఫాలో అవ్వడం ఫేమస్ రైటర్ అనే అహం లేకుండా పిల్లల అభిప్రాయాలు తెలుసుకోవడం మా నాన్నలో ఉన్న ఒక గొప్ప క్వాలిటీ.

ఎంత మంది తన నవలలు చదివి ఇన్స్పైర్ అయ్యాము అని చెప్పినా, మా నాన్నతో మాట్లాడ్డం అదృష్టంగా భావిస్తున్నాం అని చెప్పినా చాలా వినయంగా ఉండే మనస్తత్వంగల వ్యక్తి.

మేం ముగ్గురం ఏ విషయంలోనూ బడాయిపోకుండా, డౌన్ టు అర్త్ ఉండటానికి కారణం మా నాన్న. ఎంత ప్రమోషన్ వచ్చినా, ఎలాంటి కాంప్లిమెంట్ వచ్చినా, ఏ గొప్ప వ్యక్తిని కలిసినా దాని గురించి ఎక్కువగా మాట్లాడకుండా సింప్లిసిటీని మెయింటెయిన్ చెయ్యడం

మా నాన్నని చూసే నేర్చుకున్నాం. ఎప్పుడైనా నేను ఓ గీత దాటినా, నన్ను నొప్పించకుండా నవ్వుతూ సరిచెయ్యడం మా అమ్మకి చాతయినట్టే కావ్యకి, ఊహకి కూడా చాతవుతుంది. మా నాన్న మాత్రం నేను ఎంత బడాయిపోయినా నవ్వుతూ వింటారు.

*(నాన్న కబుర్లు మరిన్ని వచ్చేనెలలో)*

Click here to share your comments on this story